క్లుప్తంగా

అధికారుల నిర్లక్ష్యం తగదు



అలంపూర్‌రూరల్: గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సీపీఎం జిల్లా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని లింగన్‌వాయిలో అంతర్గత రోడ్లు దెబ్బతిన్నాయని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో గ్రామానికి వచ్చిన ఎంపీడీఓ చంద్రకళను నిలదీశారు. నిధుల కొరత వల్ల పనులు చేయలేక పోయామని నిధులు వస్తే వెంటనే పనులు చేయిస్తామని ఎంపీడీఓ సమాధానం చెప్పారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

అయిజ: మండల కేంద్రంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం స్వేరోస్ నాయకులు, కార్యకర్తలతో స్వేరోస్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మామిడాల ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిర్వహిస్తున్న కబడ్డీ, క్రికెట్ పోటీలకు 87 జట్లు వచ్చాయని పేర్కొన్నారు. ముందుగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని తర్వాత కబడ్డీ పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 14న విజేతలకు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బహుమతులు అందజేస్తారని వివరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల పేర్లు నమోదు చేసుకోండి

అయిజ: మండల కేంద్రంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న సీఎం కప్ పోటీల్లో పాల్గొనే క్రీడా కారులు పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ సాయిప్రకాశ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 15 నుంచి 30 సంవత్సరాలలోపు ఉన్న క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, కోకో, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మిగతా వివరాలకు సెల్: 9985337551 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎస్ఐగా శ్రీనయ్య బాధ్యతలు స్వీకరణ

మద్దూరు: మండల ఎస్ఐగా పి. శీనయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జ్ ఎస్ఐ నరేష్ కోస్గి సీఐ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ ఎస్ఐగా విధులు నిర్వహించి బదిలీపై మండలానికి వచ్చారు.

'ప్రతి గింజనూ కొంటాం'

అయిజ: రైతులు పండించిన వరి ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని సింగిల్ విండో ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పులికల్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించొద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్న హనుమంతు, కిషోర్, బలరాం, మక్తదీర్, సత్యమయ్య శెట్టి, సీతఓ మల్లేష్, సెంటర్ ఇన్‌చార్జ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ను విజయవంతం చేయండి



మానవపాడు: ఈ నెల 13న నిర్వహించే సీపీఎం జిల్లా వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ హాల్‌లో జిల్లా వర్క్‌షాప్ ఉంటుందని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, ప్రజాసంఘాల కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈ నెల 19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలు ఆయా గ్రామాలతోపాటు మండల కేంద్రంలో నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో రాజు, మాలిక్‌బాషా, భాస్కర్, ఈశ్వర్, శ్రీధర్, రామాంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిలోని గ్రామ శివారులో టీవీఎస్ మోపెడ్‌ను కారు ఢీకొన్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం రాజోలికి చెందిన హనుమంతు వివిధ పనుల నిమిత్తం అలంపూర్ చౌరస్తా నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. అదేసమయంలో వెనకు నుంచి గుర్తుతెలియని కారు టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో హనుమంతుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



శివకుమార్ 10/10 | పరుశరాం 10/10 | శివ 10/10 | లక్ష్మన్ 10/10 | స్వాతి కాలిత్కర్ 10/10 | రేణుక 9.7/10 | మదియా 9.7/10 | మనీషా 10/10



కేశవరెడ్డి 9.2 | జయశాలి 9.0 | నర్మద 9.0 | రాజేశ్వరి 9.3 | ఎండీ గపూర్ 8.8 | ప్రవల్లిక 9.2/10 | అఖిల 9.0/10 | శ్రీవల్లి, అలంపూర్ మండల టాపర్

ఎర్రవల్లిచౌరస్తా: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి గురుకుల, ఎర్రవల్లి సాంఘీక సంక్షేమ గురుకుల (అయిజ) పాఠశాలలకు చెందిన విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. బీచుపల్లి గురుకుల పాఠశాలకు చెందిన శివకుమార్, పరుశరాం, శివ, లక్ష్మన్‌లు పదికి పది జీపీఏ సాధించారు. 11మంది విద్యార్థులు 9.8 జీపీఏను, 11మంది విద్యార్థులు 9.7 జీపీఏతో సత్తాచాటారు. అదేవిధంగా కోదండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పావని 9.8 జీపీఏ, వల్లూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన రేణుక 9.7 జీపీఏ, ఇటిక్యాల సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో రాకేష్ 9.5 జీపీఏ, కేజీబీవీలో త్రివేణి 9.0 జీపీఏను సాధించారు.

వడ్డేపల్లి విద్యార్థుల ప్రతిభ...

శాంతినగర్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి యు.మహాలక్ష్మి 9.3 గ్రేడ్ సాధించి మొదటిస్థానంలో నిలిచింది. ఉత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌లో సానియా 10/10 జీపీఏ, మదియా 9.7/10 జీపీఏ సాధించి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. తక్కశిలలో నందిని 9 .0 గ్రేడు సాధించింది. 78 శాతం ఉత్తీర్ణులయ్యారు. పుల్లూరులో నందిని 9 గ్రేడు సాధించగా మొత్తం 81 శాతం ఉత్తీర్ణులయ్యారు. రాపురం 98 శాతం, బొంకూరు 92 శాతం , గురుకుల మైనార్టీ పాఠశాలలో 95 శాతం, మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలలో 98 శాతం, బాలుర పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణులయ్యారు.

కస్తూర్బాలో వంద శాతం ఉత్తీర్ణత..

కేటీదొడ్డి: మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత 9.5 గ్రేడ్ సాధించగా చింతలకుంట ఉన్నత పాఠశాలలో 90 శాతం ఉత్తీర్ణత 9.0 గ్రేడ్‌తో ద్వితీయస్థానం, నందిన్నె ఉన్నత పాఠశాల 81.2 ఉత్తీర్ణత సాధించగా 8.7 గ్రేడ్‌తో తృతీయ స్థానంలో నిలిచాయి. కుచినెర్ల, పాతపాలెం ఉన్నత పాఠశాలలు తర్వాత స్థానాల్లో ఉన్నాయని ఎంఈఓ సురేష్ తెలిపారు.

మల్దకల్: మండలంలోని మొత్తం పది జెడ్పీహెచ్ఎస్‌లలో 442 మందికి 311 మంది పాస్ కాగా 70.36శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ కొండారెడ్డి తెలిపారు. ఎల్కూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి కేశవరెడ్డి 9.2జీపీఏ సాధించగా, అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌లో జయశాలి, నర్మద, బిజ్వారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఉరుకుందులు 9 జీపీఏలు సాధించారు.

మానవపాడు: మండల కేంద్రంలోని పదో తరగతి ఫలితాల్లో 73శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ శివప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజేశ్వరి 9.3 సాధించి మండల టాపర్‌గా, ఎండీ గపూర్ 8.8 సాధించి ద్వితీయ స్థానంలో తెలిపారు.

రాజోళి: మండల వ్యాప్తంగా పదో తరగతి ఫలితాల్లో 80.54 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నర్సింహ తెలిపారు.

ధరూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మొత్తం 144 మంది విద్యార్థులకు 94 మంది ఉత్తీర్ణులయ్యారు. రేవులపల్లి ఉన్నత పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అఖిల 9.0 జీపీఏ సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. మార్లబీడులో 31 మంది, అల్వాలపాడులో 23, ఉప్పేరులో 86 మంది, గార్లపాడులో 11 మంది, ధరూరు కేజీబీవీలో 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీకి చెందిన ప్రవల్లిక 9.2 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

అలంపూర్‌రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. జెడ్పీహెచ్ఎస్‌లో 15, జెడ్పీహెచ్ఎస్ హరిజనవాడ 23 మంది, బుక్కపూర్ జెడ్పీహెచ్ఎస్ 19 మంది, క్యాతూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 37, బాలుర ఉన్నత పాఠశాలలో 26, లింగన్‌వాయి జెడ్పీహెచ్ఎస్‌లో 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. శ్రీవల్లి మండల టాపర్‌గా నిలిచింది.

అయిజ: మండల వ్యాప్తంగా 71 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జెడ్పీహెచ్ఎస్ భూంపురంలో 58 శాతం, చిన్నతాండ్రపాడులో 67, అయిజలో 64 , మేడికొండలో 79, పులికల్ పాఠశాలలో 87, సింధనూరులో 74, ఉప్పలలో 78 , ఉత్తనూరులో 82, యాపదిన్నెల 62, కేజీబీవీలో 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

మరిన్ని విజయాలు సాధించాలి

గట్టు: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల, మానవపాడు గురుకుల, కస్తూర్బా పాఠశాల, గొర్లఖాన్‌దొడ్డి మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్‌గా గురుకుల పాఠశాలకు చెందిన మనీషా 10 జీపీఏ సాధించింది. ఆరగిద్దకు చెందిన విష్ణు 9.3, గొర్లఖాన్‌దొడ్డికి చెందిన దేవిక 9.3 సాధించారు. గట్టు బాలికల గురుకుల పాఠశాల, మానవపాడు గురుకులంలో, కస్తూర్బా పాఠశాల, గొర్లఖాన్‌దొడ్డి ఉన్నత పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించారు. గట్టు ఉన్నత పాఠశాలలో 47 మందికి 44 మంది, మాచర్ల ఉన్నత పాఠశాలలో 71 మందికి 24 మంది, చాగదోన ఉన్నత పాఠశాలలో 28 మందికి 7 మంది, ఆలూరు ఉన్నత పాఠశాలలో 55 మందికి 36 మంది, ఇందువాసి ఉన్నత పాఠశాలలో 28 మందికి 12 మంది విద్యార్థులు, ఆరగిద్ద ఉన్నత పాఠశాలలో 15 మందికి గాను 13 మంది, తప్పెట్లమొర్సు ఉన్నత పాఠశాలలో 21 మందికి 20 మంది విద్యార్థులు, బోయలగూడెం ఉన్నత పాఠశాలలో 23 మందికి 10 మంది విద్యార్థులు పదిలో ఉత్తీర్ణత సాధించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



ఉండవెల్లిలో బండలాగుతున్న ఎద్దులు

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఈదమ్మ దేవర సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. బుధవారం ఆంధ్ర, తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల నుంచి ఎద్దులు బల ప్రదర్శనలో పాల్గొన్నాయి. కర్ణాటక రాష్ట్రం, ఫల్కంపల్లి గ్రామానికి చెందిన ఖాజాహుస్సేన్ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచారు. విజేతకు అమృతా డెవలప్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులు రూ.60 వేల నగదును అందజేశారు. రెండో బహుమతిని పెంచికల పాడుకు చెందిన రాకెట్ల చివ లింగప్ప ఎద్దులు నిలిచాయి. కృష్ణవేణి ఐటీఐ, కృష్ణవేణి మోడల్ స్కూల్ యాజమాన్యం రూ.50 వేలు నగదును అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన అనంతపురం జిల్లా మేడిమూకులపల్లె గ్రామానికి చెందిన తోట తిరుపాల్ రెడ్డికి వీకేర్ కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు రూ.40 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ బాల్‌రాజు, ఏఎస్ఐ అయ్యన్న, పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, విక్రమసింహా రెడ్డి, రైతు సంఘం సభ్యులు ముత్యాల్ రెడ్డి, కొండన్న, రామ్ కోటిరెడ్డి, నాగేంద్రం, వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, ఎంపీటీసీలు రాజశేఖర్, సుంకన్న, పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: మున్సిపాలిటీ అభివృద్ధిలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వర్కర్లకు జీతాలు, శానిటేషన్‌కు సంబంధించిన నిధుల విడుదల, ఇతర అభివృద్ధి పనులపై తీర్మానాలు ప్రవేశపెట్టారు. పట్టణంలో రోడ్డు డివైడర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, రోడ్డుకు ఇరువైపులా సీసీరోడ్ల నిర్మాణ పనులు వారం రోజుల్లోగా ప్రారంభిస్తామని సభ తెలిపారు. స్థానికులు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఇక్కడ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన బీఎన్‌కే రమేష్‌ను, నూతన బాధ్యతలు చేపట్టిన నాగరాజును పూలమాలలు, శాలువాలో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెన్నయ్య, అశ్విన్ కుమార్, మహేశ్వరి, పోషన్న, నాగలక్ష్మి, మండ్లరామకృష్ణ, తబస్సుంమోసీన్, కోఆప్షన్ సభ్యులు రియాజ్‌అలీ, కిషన్‌చంద్, షాహీన్‌బేగం, జ్యోతి మల్లేష్, సిబ్బంది ఉన్నారు.

కమిషనర్‌ను సన్మానించిన తహసీల్దార్

ఆత్మకూర్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి బదిలీపై వెళ్తున్న బీఎన్‌కే రమేష్‌ను తహసీల్దార్ సింధూజ పూలమాల, శాలువాతో సన్మానించారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో అందరిని భాగస్వామ్యం చేస్తూ ముందుకువెళ్లారని అభినందించారు. అలాగే పురపాలిక ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపాలిటీ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మంజుల

అమరచింత: గుండెపోటుతో ఆకస్మికంగా ప్రాణాపాయ స్థితికి చేరిన వ్యక్తిని సీపీఆర్ విధానంతో త్వరితంగా కోలుకునేలా చెయొచ్చని డాక్టర్ పరిమళ, డాక్టర్ మంజుల తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ చొరవతో అన్ని మండలాల్లో ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సీపీఆర్ విదానం గురించి అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీపీఆర్ గురించి అధికారులకు వివరించారు. ప్రమాదకర పరిస్థితులలో స్పృహ కోల్పోయిన వారి ఛాతి భాగాన్ని రెండు చేతులతో బలంగా నొక్కడం ద్వారా గుండె కొట్టుకులా చేయొచ్చన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తమ తమ పరిధిలోని ప్రతి ఒక్కరికీ వీటి గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శరత్, నిస్సార్, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎస్ఐ శివనాగేశ్వర నాయుడు, హెల్త్ సూపర్ వైజర్ సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: స్థానిక ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, పోలీసులు, ఆయా శాఖల అధికారులకు సీపీఆర్ చేసే విధానంపై బుధవారం వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. గుండె పోటుకు గురైన బాధితుల పల్స్ చెక్ చేసిన అనంతరం సీపీఆర్ చేయాలని డాక్టర్ పరిమళ, డాక్టర్ మంజుల అన్నారు. ఈసందర్భంగా ఒక్కరికి సీపీఆర్ చేసే విధానంపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైద్యులు షరత్, నిస్సార్‌అహ్మద్, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రాజోళి: మండలంలోని తూర్పుగార్లపాడులో ఉన్న తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఇటిక్యాల మండలంలోని సాతర్లలో మన ఊరు మన బడి పనుల పేరుతో ఇసుక తరలిస్తుండగా అందుకున్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అనుమతిపత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ సీహెచ్ కుర్మయ్య తెలిపారు.

పట్టుదలతో చదివితే విజయం



పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: పట్టుదలతో చదివితే విజయం తథ్యమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సొంత నిధులతో సమకూర్చిన వివిధ పోటీ పరీక్షల మెటీరియల్‌ను ఎమ్మెల్యే గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వివిధ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఏకాగ్రతతో చదివి కొలువు సాధించాలన్నారు. గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, ఎంపీపీ విజయ్ కుమార్, నాయకులు నరేందర్ రెడ్డి, శ్రీరాములు, గ్రంథాలయ అధికారి రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

వైభవంగా పెద్దమ్మ దేవర

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగలలో వెలసిన పెద్దమ్మ దేవరను బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతకు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. అమ్మవారి నామస్మరణ మార్మోగింది. మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

కొనసాగుతున్న కంటి వెలుగు

మానవపాడు: మండలంలోని కొర్విపాడులో బుధవారం 3వ రోజు కంటివెలుగు కార్యక్రమం డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. 151 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 22 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 28 మందికి కంటి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రన్న, శ్రావణి, లక్ష్మీనారాయణ, రాణి, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదం'



పూడురులో ఇంటింటికి ప్రజాపోరు యాత్రను నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గద్వాల అర్బన్: బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. బీజేపీ హఠావో దేశ్‌కో బచావ్ అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటింటికి సీపీఐ ప్రజా పోరు యాత్రలో భాగంగా బుధవారం గద్వాల మండలంలోని జమ్మిచేడు, వీరాపురం, పూడురు, చెనుగోనిపల్లి గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశానికి పెను ప్రమాదం ఉందన్నారు. పెట్టుబడిదారుల లాభం కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రంగన్న, చెన్నయ్య, వినోద్, వెంకటేష్, ప్రవీణ్, పరుష, రాజు, వెంకట్ తదితరులు ఉన్నారు.

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు, తక్కశిల గ్రామాల్లో బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ, నాయకులు బీజేపీ హఠావో దేశ్‌కో బచావ్‌లో భాగంగా ఇంటింటికి సీపీఐ ప్రజా పోరు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగన్న, కంచుపాడు వీరాంజనేయులు, ఆషన్నా, రాజు, పరుష, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ ప్రభాకర్ రెడ్డి

గద్వాల అర్బన్: నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలపై సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం చేపట్టిన తర్వాత నిరుద్యోగులను మోసం చేసిన ఘటన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పూర్తిగా అవినీతిమయమై ప్రశ్నపత్రాలు లీకై జీఅయి విద్యార్థుల భవిష్యత్తులను అంధకారంలో నెట్టారన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆవిష్కరించిన యూత్ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేస్తామన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు రూ.25 వేల పెన్షన్ ఇస్తామన్నారు. సమావేశంలో నాయకులు నారాయణ రెడ్డి, గౌస్, ఇసాక్, నందు, మజీద్, రాజేంద్ర, రఘు, పాషా ఉన్నారు.

మూడేళ్లుగా ఎదురుచూపులే..

- గొర్రెల పంపిణీలో జాప్యం
- పట్టించుకోని అధికారులు



చెన్నిపాడులో గొర్రెల మంద

మానవపాడు: అన్ని కులాల వారికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. గొల్ల కురుమ కులస్తులు ఆర్థికంగా ఎదిగేందుకు గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లబ్ధిదారులను ఎంపిక చేసి వివిధ రాష్ట్రాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసి పంపిణీ చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా రెండో విడత పంపిణీకి ఎన్నో అడ్డంకులు ఏర్పడుతున్నాయి. జీవాల పంపిణీలో నీలినీడలు కమ్ముకున్నాయి. మూడేళ్లు గడుస్తున్నా లబ్ధిదారులు వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. మొదటి విడతలో అధికారులు ఎంతో ఆర్భాటంగా పంపిణీ చేసినా రెండో విడత వచ్చే సరికి జాప్యం జరగడంతో అర్హులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గొర్రెలను పెంచి పునరుత్పత్తి చేసి ఉపాధి పొందుతామని ఆశించిన లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. ఇంతకు గొర్రెలు పంపిణీ చేస్తారో చేయరో తెలియని అయోమయ స్థితి ఏర్పడ్డది. మొదటి విడుతలో పంపిణీ పంపిణీ సాఫీగా సాగినా... రెండోవిడుతలో మాత్రం పంపిణీ నత్తనడకన సాగుతోంది.

75 శాతం రాయితీపై...

రాష్ట్రంలో మాంసం ఉత్పత్తిని పెంచడంతోపాటు గొల్ల, కురుమలకు ఆర్థికంగా అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పురోగతి కనిపించడంలేదు. 75 శాతం రాయితీపై జీవాలను అందజేస్తోంది. ఒక్కో యూనిట్‌పై 20 గొర్రెలు, ఒక విత్తన పొట్టేలు పంపిణీ చేస్తోంది. స్థానికంగా లభించే జీవాలు కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో గొర్రెలను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఒక యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలు విలువ రూ. 1.75 లక్షలు కాగా, అందులో ప్రభుత్వం యూనిట్‌కు 75 శాతం రాయితీ ఇస్తుండగా.. మిగతా 25 శాతం లబ్ధిదారులు అకౌంట్ నుంచి రూ. 43వేలు నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ ద్వారా కలెక్టర్ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ జరుగుతుందని అధికారులు వెల్లడించారు. మొదటి విడతలో కొంతమందికి మాత్రమే గొర్రెల పంపిణీ చేశారు. మిగతా వారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మండలం	మొదటి విడుత పంపిణీ	రెండవ విడుతలో..	పంపిణీ చేయాల్సిన యూనిట్లు
మానవపాడు	892	54	1850
ఉండవెల్లి	304	274	1274
ఇటిక్యాల	1622	112	1523
వడ్డెపల్లి	1233	94	3435
అయిజ	953	165	7324
అలంపూర్	774	207	2555
రాజోలి	221	108	2204

త్వరగా పంపిణీ చేయాలి



ప్రభుత్వం నుంచి వచ్చిన వెంటనే యూనిట్లు అందజేస్తామని అధికారులు చెప్తున్నారు. మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు గొర్రెలను పంపిణీ చేయలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం త్వరగా గొర్రెలను లబ్ధిదారులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటేష్ చెన్నిపాడు

సబ్సిడీ పెంచే అవకాశం



గొర్రెల పంపిణీ యూనిట్లపై సబ్సిడీ పెంచే అవకాశం ఉంది. దీంతో జాప్యం జరుగుతుందని భావిస్తున్నాం. బడ్జెట్‌లో రెండో విడత గొర్రెల పంపిణీకి రూ.3 వేల కోట్లు కేటాయించారు. కొంతమందికి ఇప్పటికే అందజేశాం. మిగతావారికి కూడా త్వరలో యూనిట్లు అందుతాయి.

– నరసింహులు, మాజీ సర్పంచ్, మానవపాడు

కరోనా వల్ల ఆలస్యం..

కరోనా ప్రభావం వల్ల యూనిట్ల పంపిణీలో జాప్యం జరుగుతోంది. అర్హులైన వారిని గుర్తించాం. ప్రతిఒక్కరికి గొర్రెలను పంపిణీ చేస్తాం. ఈ వారంలో రెండో విడుత గొర్రెల పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్హులు అధికారులకు సహకరించాలి.

– వెంకటేశ్వర్లు, జిల్లా పశు వైద్యాధికారి